క్లుప్తంగా

జగనన్న కాలనీలో పక్కాగృహం ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: జగనన్న గృహ నిర్మాణ పథకంతో పేదలు తమ సొంతింటి కలను సాకారం చేసుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన సెంటు స్థలంలో కారింకి సునీత అనే లబ్ధిదారు నూతన గృహం నిర్మించుకుంది. ఆ గృహాన్ని గురువారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు అందించి సొంతింటి కలను నెరవేర్చడమే గాకుండా సమాజంలో తలెత్తుకుని తిరిగే గౌరవాన్ని కల్పించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మాజీ ఎంపీపీ సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, కౌన్సిలర్ గోపిరెడ్డి శ్రీనివాస్, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్, తేలేటి కోటి, కొత్తూరి శ్రీను పాల్గొన్నారు.

17 ఏళ్లు పైబడితే ఓటర్లుగా చేర్చాలి

నల్లజర్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 17 ఏళ్లు పైబడిన వారందరినీ కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని తహసీల్దార్ కిశోర్‌కుమార్ సూచించారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు స్పెషల్ సమ్మరీ రివిజన్–2024, ప్రీ రివిజన్ యాక్టివిటీస్‌పై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, ఇంటింటి సర్వేతో ఓటరు నమోదు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు గురించి వివరించారు. బూత్ లెవల్ ఆఫీసర్లకు పోలింగ్ స్టేషన్‌పై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఇంట్లో ఏ వయస్సు వారు ఉన్నారు? ఎంతమందికి ఓట్లు ఉన్నాయి? అనే విషయాలపై రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికి ఫారం–7 పెట్టి కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చి ఓటు తొలగించాలన్నారు.

ప్రతిభావంతులకు యూటీఎఫ్ పురస్కారాలు

ఉండ్రాజవరం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.వెంకటరత్నం మాట్లాడుతూ అధ్యయనం, అభ్యసనం, సామాజిక స్పృహ లక్ష్యంగా ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తారన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టడమే కాకుండా నాణ్యమైన పుస్తకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మెండే వెంకట్రావు, కరుటూరి నరేంద్ర, యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఐ.రాంబాబు, మండల శాఖ కార్యదర్శి దువ్వాపు రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య

జెడ్పీ పీఠంపై బీసీ మహిళ

- చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ ఎన్నిక
- 'ఉమ్మడి పశ్చిమ' చరిత్రలో బీసీలకు ఇదే ప్రథమం
- ఆ వర్గాల్లో వెల్లివిరిసిన ఆనందం
- ఏలూరులో ప్రమాణ స్వీకారం



ఘంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్ పర్సన్

కొవ్వూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవి బలహీన వర్గానికి చెందిన ఘంటా పద్మశ్రీకి దక్కింది. ఈ మేకు ఆమెకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో ఆ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి. ఏలూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో పద్మశ్రీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చరిత్రలో తొలిసారి బీసీ మహిళకు జెడ్పీ చైర్మన్ పదవి దక్కడంతో ఆ వర్గాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకూ ఇక్కడ జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించిన కవురు శ్రీనివాస్ స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. దీంతో చైర్మన్ పదవికి ఖాళీ ఏర్పడింది. పెదపాడు నుంచి వైఎస్సార్ సీపీ తరఫున జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన ఘంటా పద్మశ్రీని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కె.ప్రసన్నకుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించి గురువారం ఏలూరులో జెడ్పీ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీ పేరును ద్వారకాతిరుమల జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్ ప్రతిపాదించగా దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం బలపరిచారు. ఈ ఎన్నికకి హాజరైన 35 మందిలో మిగిలిన సభ్యులందరూ ఏకగ్రీవంగా పద్మశ్రీని బలపరిచారు. దీంతో పద్మశ్రీ జెడ్పీ చైర్మన్‌గా ఎన్నికైనట్టు కలెక్టర్ ప్రకటించారు.



జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఘంటా పద్మశ్రీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ తదితరులు

ప్రముఖుల అభినందనలు

జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పద్మశ్రీని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసు బాబు, తలారి వెంకట్రావు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్సీలు వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, కలెక్టర్ ప్రసన్నకుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల జెడ్పీటీసీ సభ్యులు పద్మశ్రీకి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- తిమ్మాపురంలో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన

ద్వారకాతిరుమల: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.44.37 లక్షల వ్యయంతో మండలంలోని తిమ్మాపురం ఎస్సీ కాలనీలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి మాట్లాడుతూ నియోజకవర్గానికి జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.39 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో ద్వారకాతిరుమల మండలానికి రూ.10.60 కోట్లు వెచ్చించామని, త్వరలో ఈ పనులకు శ్రీకారం చుడతామన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామని, సెకండ్ ఫేజ్‌లో ఇళ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ నల్లజర్ల మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, తిమ్మాపురం సర్పంచ్ యర్రగొల్ల రజని, ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోదావరి స్నానానికి దిగిన యువకుడి మృతి



గంగవరపు అజయ్ (ఫైల్)

కొవ్వూరు: వాడపల్లి సమీపంలో గోదావరి నదిలో స్నానానికి దిగిన చాగల్లు మండలం మీనానగరానికి చెందిన గంగవరపు అజయ్ (25) అనే యువకుడు ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోయాడు. కొవ్వూరుకు చెందిన ఇద్దరు స్నేహితులతో కలసి గురువారం అజయ్ వాడపల్లి సమీపంలో వశిష్ఠ మహర్షి స్నానఘట్టం వద్దకు వచ్చాడు. మిత్రులు ఇద్దరూ ఒడ్డున కూర్చోగా అజయ్ ఒక్కడే నదిలో స్నానానికి దిగాడు. స్నానం చేస్తుండగా అజయ్ ప్రమాదవశాతూ జారి పడడంతో నీటిలో మునిగి పోయినట్టు చెబుతున్నారు. వెంట వెళ్లిన స్నేహితులకు ఈత రాక పోవడంతో కేకలు వేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి అజయ్‌ను వెలికి తీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు ఘటనా స్థలాన్ని పరిశీలించిన కొవ్వూరు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అజయ్ మృతికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మృతుడు అజయ్ గతంలో ఏపీఎండీసీ సంస్థ ఆధ్వర్యంలోని ఇసుక ర్యాంపుల్లో పనిచేసేవాడని తెలిపారు. ప్రస్తుతం ఒంగోలు జిల్లాలో ఇసుక నిర్వహణ సంస్థలో పనిచేస్తున్నాడన్నారు. పది రోజుల క్రితం స్వగ్రామమైన మీనానగరం వచ్చినట్టు సీఐ తెలిపారు. ఈ నేపథ్యంలో గతంలో ఇక్కడి ఇసుక ర్యాంపుల్లో కలిసిన పనిచేసిన ఇద్దరు మిత్రులను వెంటబెట్టుకుని వాడపల్లి వచ్చినట్లు సీఐ తెలిపారు. మీనానగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గంగవరపు రాజేంద్ర ప్రసాద్‌కు అజయ్ పెద్ద కుమారుడు.

నిడదవోలు ఎంపీడీఓగా శామ్యూల్



నిడదవోలు ఎంపీడీఓ శామ్యూల్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

నిడదవోలు రూరల్: నిడదవోలు ఎంపీడీగా పి.శామ్యూల్ గురువారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ వీరవాసరం ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా పనిచేసిన శామ్యూల్ ఎంపీడీవోగా పదోన్నతి పొంది బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ నిడదవోలులో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన టి.మూర్తిబాబు ఆచంట మండల ఈఓపీఆర్డీగా బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓ శామ్యూల్‌ను కార్యాలయ ఏఓ రత్నరాజు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ టి.గోపాలకృష్ణ, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



పెరవలి ఎంపీడీఓ దామోదరరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన మండల పరిషత్ సిబ్బంది

పెరవలి ఎంపీడీఓగా దామోదరరావు

పెరవలి: పెరవలి ఎంపీడీఓగా డి. దామోదరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెంటపాడు ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి ఇచ్చి దామోదరరావుకు స్వాగతం పలికారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఏఓ రమేష్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది ఒక్కొక్కరూ ఎంపీడీవోకు పరిచయం చేసుకున్నారు.

ఉండ్రాజవరంలో వేంకటేశ్వర విగ్రహ ప్రతిష్ఠ

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో కొత్తగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి, ద్వారపాలక, శిలా విగ్రహ జీవ ధ్వజస్తంభ, నూతన ఆలయ ప్రతిష్ఠా వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ధ్వజస్తంభాన్ని, స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులతో కలసి హోమంలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజిని, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు బూరుగుపల్లి భాస్కరరావు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ చైర్మన్ కుదప చక్రపాణి, బీఎస్సార్ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

12న కోదండరామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

తాళ్లపూడి: పోచవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన కోదండ రామాలయంలో శుక్రవారం నుంచి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుంది. ఈ నెల 12 వరకూ ఈ ఆలయంలో లక్ష్మణ, హనుమత్ సమేత సీతారామచంద్రస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠా వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యుడు కాకర్ల వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సుమారు రూ.కోటి వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, వాస్తు పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సహస్ర కలశాభిషేకం, క్షీరాదివాసం, నవగ్రహ హోమం వంటి పూజలు జరుగుతాయి. 12న విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతుంది. అనంతరం అదే రోజున భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హోంమంత్రి తానేటి వనిత హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.



తాళ్లపూడి మండలంపోచవరంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం

వాసవీ మాత గుడిలో వార్షికోత్సవ పూజలు

తాళ్లపూడి: స్థానిక నగరేశ్వరి సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అర్చకులు జంధ్యాల గంగాధరశాస్త్రి ఆధ్వర్యంలో తొలిరోజు కలశాలతో పూజలు, మేళతాళాలతో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని దేవరపల్లి, గొల్లగూడెం ఫీడర్లలో శుక్రవారం విద్యుత్తు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ అచ్యుతాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు ఫీడర్ల పరిధిలో విద్యుత్తు లైన్ల కింద గల చెట్ల కొమ్మల తొలగింపు కోసం శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు

ఉండ్రాజవరం: వెలగదుర్రు గ్రామంలో సుమారు రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని వెలగదుర్రు పంచాయతీ సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ గురువారం తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులను, రైతులను వారు కోరారు.

రేపటి నుంచి సుందర గోవిందుడి బ్రహ్మోత్సవాలు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందర గోవిందుడి ఆలయంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో ఏకాదశ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకుడు పారుపూడి సూర్య రామ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. మూడు రోజుల పాటు ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ నరసింహ సహిత మహా సుదర్శనయాగం, స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

సచివాలయ సేవలను విస్తృతం చేయాలి

నల్లజర్ల: సచివాలయ సేవలను విస్తృతం చేయాలని ఎంపీడీఓ ఎం.రాజశేఖర్ సిబ్బందికి సూచించారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన గురువారం సచివాలయ ఉద్యోగులతో నల్లజర్లలో పరిచయ సమావేశం నిర్వహించారు. దరఖాస్తుదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి అర్జీలను వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన బంగారు కొండ పథకాన్ని సద్వినియోగం చేద్దామని ఎంపీడీఓ కోరారు.

మండలంలో అల్పసంఖ్యాక వర్గాల్లోని ఆరేళ్లలోపు చిన్నారులు 122 మందిని గుర్తించామని చెప్పారు. వారందరికీ ఆరు నెలల పాటు పౌష్టికాహారం అందించేలా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు. ఈ చిన్నారులను దత్తత తీసుకొని నెలకు రూ.500 చొప్పున అందించాలన్నారు. ఆ సొమ్ముతో ఆరు నెలలకు సరిపడా రేషన్ కిట్‌లను ఆ చిన్నారులకు అందిస్తారన్నారు. ప్రతి బుధవారం దత్తత తీసుకున్న పిల్లాడి వద్దకు వెళ్లి ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించవలసి ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు అజయ్ బాబు, వినోద్‌కుమార్, సత్యనారాయణ, వైబీటీ సుందరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుపల్లిలో 142 మందికి నేత్ర వైద్య సేవలు

నిడదవోలు రూరల్: కంటి వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు అన్నారు. మండలంలోని కోరుపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఏలూరు ఆశ్రమం కంటి వైద్య నిపుణులు142 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కారింకి సత్యనారాయణ, నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, కారింకి చినరాముడు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సొసైటీ అధ్యక్షుడు రాజారావు తదితరులు

భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన

దేవరపల్లి: భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ అన్నారు. రీ సర్వే నిమిత్తం మండలంలోని గౌరీపట్నం, కొండగూడెం, కురుకూరు, త్యాజంపూడి గ్రామాలకు గురువారం ఓఆర్ఐలు గల మ్యాప్‌లు వచ్చాయని ఆయన తెలిపారు. సోమవారం నుంచి ఆయా గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు.సర్వేపై ఆర్ఐ డి. వెంకటేష్ ఈ గ్రామాల రైతులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. రైతులు రీ సర్వే బృందానికి సహకరించాలని తహసీల్దార్ కోరారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

ఎండ తీక్షణం.. ఆపై వడగాడ్పులు



జాతీయ రహదారి పక్కనే ఖండవల్లిలో ఆగిన వాహనాలు

- నిప్పుల కొలిమిలా పెరవలి
- ఉక్కిరిబిక్కిరవుతున్న జనం

పెరవలి: రోహిణీ కార్తె ముగిసినా ఎండ వేడిమి ఏమాత్రం తగ్గుముఖం పట్టలేదు. భానుడి భగభగలకు వడగాడ్పులు తోడవడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భరించలేక ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పెరవలి మండలంలో వారం రోజుల పాటు 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంతకు మించి మంగళవారం 47, బుధవారం 46, గురువారం 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 8 గంటలకే వేడిగాలులు మొదలవుతున్నాయి. దాంతో వ్యాపార సంస్థలు కూడా మూతపడ్డాయి. గ్రామాల్లో కరెంటు కోతల వలన ప్రజలు ఇంటిలో ఉండలేక వీధిలోకి రాలేక నానా అగచాట్లు పడుతున్నారు. కరెంటు ఉన్నా పిల్లలు, వృద్ధులు ఉక్కపోత భరించలేక అల్లాడిపోతున్నారు. వృద్ధులు ఇళ్లలో ఉండలేక చెట్ల కింద కాలక్షేపం చేశారు. లో ఓల్టేజీ వలన ఫ్యానులు కాలిపోవడం, ఏసీలు పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో రద్దీగా ఉండే జాతీయ రహదారులు నిప్పులు కక్కుతున్న భానుడి ప్రతాపానికి నిర్మానుష్యంగా మారుతున్నాయి. పగటిపూట డ్రైవర్ల వాహనాలను ఎక్కడికక్కడ నిలుపుదల చేసి విశ్రాంతి తీసుకుంటున్నారు.